ఈటల ఏం చేసిండని గెలుస్తడు?: మల్లారెడ్డి

హైదరాబాద్ సిటీబ్యూరో, ఏప్రిల్ 27 (నమస్తే తెలంగాణ): ఈటల రాజేందర్‌ను ఉద్దేశించి అన్న వ్యాఖ్యలపై మాజీమంత్రి మల్లారెడ్డి వివరణ ఇచ్చారు. 'ఎదురుపడిన మనిషిని మాట వరసకు నువ్వే గెలుస్తావ్ అని అన్న. దానికి సోషల్ మీడియాలో తిప్పుతుండ్రు. అసలు ఈటల రాజేందర్ మల్కాజిగిరికి ఏం చేసిండు? ఆయనకు ఇక్కడ ఓటు లేదు. ఆయనది మల్కాజిగిరి కాదని పేర్కొన్నారు.

ఆదిలాబాద్ బీజేపీ అభ్యర్థిపై ఫిర్యాదు

హైదరాబాద్, ఏప్రిల్ 27 (నమస్తే తెలంగాణ): బీజేపీ ఆదిలాబాద్ లోక్‌సభ అభ్యర్థి గోడం నగేశ్, కలెక్టర్, రిటర్నింగ్ అధికారి రాజర్షిషాపై బీఆర్ఎస్ నేతలు దాసోజు శ్రవణ్‌కుమార్, ఆశిష్ శనివారం సీఈవో వికాస్‌రాజ్‌ను కలిసి ఫిర్యాదు అందజేశారు. గోడం నగేశ్ ఎన్నికల అఫిడవిట్‌లో పూర్తి వివరాలు నమోదు చేయలేదని, ఈ విషయంపై ఆర్వోకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని సీఈవో దృష్టికి తెచ్చారు. బీజేపీ అభ్యర్థి నామినేషన్‌ను తిరస్కరించి, రిటర్నింగ్ అధికారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఎన్నికల కమిషన్ ఏకపక్షంగా బీజేపీకి అనుకూలంగా పని చేస్తున్నదని దాసోజు శ్రవణ్ విమర్శించారు. నగేశ్ నామినేషన్‌ను తిరస్కరించడానికి ఆధారాలు చూపినా రిటర్నింగ్ అధికారి తిరస్కరించలేదన్నారు.

మతిస్థిమితం కోల్పోయిన రేవంత్

బీజేఎల్పీ నేత మహేశ్వర్‌రెడ్డి

హైదరాబాద్, ఏప్రిల్ 27 (నమస్తే తెలంగాణ): సీఎం రేవంత్‌రెడ్డి మతిస్థిమితం కోల్పోయి మాట్లాడుతున్నారని బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ఆరోపించారు. నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడారు. రేవంత్‌రెడ్డి గతంలో టీడీపీలో పనిచేశారని, బాల కృష్ణ తరహాలో పెద్ద పెద్ద డైలాగులు కొడుతున్నారని ఎద్దేవా చేశారు. రిజర్వేషన్ల విషయంలో కాంగ్రెస్ రాజకీయ డ్రామాలు ఆడుతున్నదని ఆరోపించారు. రాజ్యాంగాన్ని ఎక్కువసార్లు సవరించింది కాంగ్రెస్ పార్టీయేనని తెలిపారు. మైనార్టీలకు ప్రాధాన్యమిచ్చి, ఎస్టీలు, బీసీలకు అన్యాయం చేసిందని ధ్వజమెత్తారు. కాంగ్రెస్‌కు ఆరు గ్యారెంటీలు, యూత్ డిక్లరేషన్ గుర్తుకు రావడమే లేదని ఆరోపించారు.

నాడు ఓటుకు నోటు.. నేడు ఓటుకు ఒట్టు

- రేవంత్‌రెడ్డికి ఓటమి భయం.. అందుకే ఒట్లు
- కేసీఆర్ బస్సుయాత్రతో బుగులు
- ఉద్యమంలో జిరాక్స్ పేపర్ ఇచ్చి ఆంధ్రా నాయకుల అడుగులకు మడుగులు ఒత్తిండు
- తెలంగాణకోసం పదవులు త్యజించిన
- ఇప్పటికీ మాట మీద కట్టుబడి ఉన్నా
- దేవుళ్ల మీద ఒట్టు పెట్టి మోసాలు
- కాంగ్రెస్ నేతల్లో ఫ్రస్ట్రేషన్..
- హస్తం పార్టీకి ఓటేస్తే జిల్లాలను రద్దుచేస్తరు
- సీఎం రేవంత్‌పై హరీశ్ ధ్వజం

కరీంనగర్‌లోని 9వ డివిజన్ కోతిరాంపూర్‌లో ప్రజలను ఓట్లు అభ్యర్థిస్తున్న తన్నీరు హరీశ్‌రావు. చిత్రంలో కరీంనగర్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్, ఎమ్మెల్యే గంగుల కమలాకర్

సిద్దిపేట/కరీంనగర్, ఏప్రిల్ 27 (నమస్తే తెలంగాణ): నాడు ఓటుకు నోటు కేసులో దొరికిపోయిన రేవంత్‌రెడ్డి.. నేడు ఓటు కోసం దేవుళ్లపై ఒట్టు పెడుతున్నారని మాజీ మంత్రి హరీశ్‌రావు ఆరోపించారు. బీఆర్ఎస్ 24వ ఆవిర్భావ వేడుకల్లో భాగంగా శనివారం సిద్దిపేటలోని పార్టీ కార్యాలయంలో గులాబీ జెండాను ఎగురవేశారు. అనంతరం కరీంనగర్‌లో నిర్వహించిన ఇంటింటా ప్రచారంలో భాగంగా పాదయాత్ర చేశారు. ఈ సందర్భాల్లో మాట్లాడిన హరీశ్.. ఓటమి భయంతోనే సీఎం రేవంత్ దేవుళ్లపై ఒట్టు పెట్టుకోవటం, రిజర్వేషన్ల ముసుగులో కొత్త డ్రామాకు తెరలేపారని విమర్శించారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ ఓడిపోతే తనను దించేస్తాననే భయం రేవంత్‌రెడ్డికి పట్టుకున్నదని, ఇది ఆయన మాటల్లో, ముఖంలో స్పష్టంగా కనిపిస్తున్నదని అన్నారు. కేసీఆర్ బస్సు యాత్రలో ప్రజలు బీఆర్ఎస్ వైపు చూస్తున్నారని వెల్లడించారు. సీఎం రేవంత్‌రెడ్డి సవాల్ చేసినట్టు వెంటనే తన రాజీనామా లేఖను మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డికి అందించాలని, ఆ తర్వాత రెండు నిమిషాల్లో తాను రాజీనామా లేఖ అందజేస్తానని మరోసారి సవాల్ విసిరారు. రాజీనామా లేఖతో తాను గన్‌పార్క్ వద్దకు వస్తే, సీఎం తన రాజీనామా లేఖ ఇవ్వకుండా సొల్లు మాటలు చెప్తున్నారని విమర్శించారు. ఉద్యమ సమయంలోనూ రాజీనామా చేయాలని అడిగితే రేవంత్‌రెడ్డి జిరాక్స్ పేపర్ ఇచ్చి ఆంధ్రా నాయకుల అడుగులకు మడుగులు ఒత్తారని ఆరోపించారు. తాము మాత్రం పదవుల కోసం పాకులాడే వ్యక్తులం కాదని, తెలంగాణ కోసం తాను రెండు సార్లు ఎమ్మెల్యే పదవికి, మంత్రి పదవికి రాజీనామా చేసి ప్రజల్లోకి వెళ్లానని గుర్తు చేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో చెప్పినట్టు ఆరు గ్యారెంటీలు, రూ.2 లక్షల రుణమాఫీ, మహిళలకు రూ.2,500, రైతులకు రూ.15 వేల రైతుభరోసాతో పాటు 100 రోజుల్లో అమలు చేస్తామని సోనియాగాంధీతో చెప్పించిన హామీలను ఆగస్టు 15లోపు అమలు చేస్తే తాను రాజీనామాకు సిద్ధమేనని మరోసారి స్పష్టం చేశారు. తెలంగాణ ప్రజల సంక్షేమం కోసం, కాంగ్రెస్ ప్రజలకు ఇచ్చిన హామీల అమలు కోసం రాజీనామా చేయడానికి తాను సిద్ధంగా ఉన్నానని తేల్చిచెప్పారు. దమ్ముంటే ఇచ్చిన హామీలను అమలు చేయాలని, అంతేకానీ దేవుళ్ల పేరుమీద ఒట్టు పెట్టి ప్రజలను మోసం చేయడం తగదని చురక అంటించారు. ఇప్పటికైనా బాండ్‌పేపర్లలో రాసిచ్చిన 6 గ్యారెంటీలు, 420 హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు.

కోమటిరెడ్డి సొల్లుమాటలు

తొలి సంతకం రుణమాఫీపై అని చెప్పి ప్రజలను కాంగ్రెస్ మోసం చేసిందని, గ్యారెంటీలకు చట్టబద్ధత కల్పిస్తామని అబద్ధపు మాటలు చెప్పిందని హరీశ్ విమర్శించారు. ప్రతిపక్ష నాయకుడిగా హామీలు అమలు చేయాలని కోరితే.. కోమటిరెడ్డి లాంటోళ్లు కొంతమంది సొల్లు మాటలు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. ప్రజల పక్షాన ప్రభుత్వాన్ని నిలదీస్తే, ఆ ఫ్రస్ట్రేషన్‌లో తనను తిడుతున్నారని తెలిపారు. తిట్టుడు మాని ఇచ్చిన హామీలు అమలు చేయాలని హితవు పలికారు. ఉద్యమ సమయంలో రాజీనామాలు చేయాలని కోరితే కిషన్‌రెడ్డి, రేవంత్‌రెడ్డి తప్పించుకున్నారని ఆరోపించారు. రేవంత్ రెడ్డి జిరాక్స్ పేపర్ ఇస్తే, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి రాజీనామా చేయకుండా వెన్ను చూపారని విమర్శించారు. తాము ప్రజల కోసం పదవులను వదులుకుంటే, ఈ నాయకులు ఇద్దరు ఆంధ్రా పాలకుల కోసం పదవులు పట్టుకొని వేలాడారని ధ్వజమెత్తారు. ఇక, జిల్లాలు ఎక్కువయ్యాయని, కమిషన్ వేసి పార్లమెంట్ స్థానం లెక్కన జిల్లాను చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతున్నారని, మెదక్ పార్లమెంట్ పరిధిలోని మూడు జిల్లాలు ఉన్నాయని, మరి ఇందులో ఏ రెండు జిల్లాలను రద్దు చేస్తారని ప్రశ్నించారు. జిల్లాలు రద్దు చేస్తామంటున్న కాంగ్రెస్‌కు ఓటేస్తే మళ్లీ మోసపోతామని, ప్రజలు ఈ ఎన్నికల్లో ఆ పార్టీకి బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. సిద్దిపేట జిల్లాను రద్దు చేస్తామంటే, జిల్లా ప్రజలు ఊరుకోబోరని, గుణపాఠం చెప్తారని పేర్కొన్నారు.

తెలంగాణ కోసం బీఆర్ఎస్ మరో ప్రజా ఉద్యమం

హైదరాబాద్, ఏప్రిల్ 27 (నమస్తే తెలంగాణ): తెలంగాణ ప్రయోజనాలకు విఘాతం కలుగుతున్న ఈ తరుణంలో తెలంగాణ కోసం మరోసారి ప్రజా ఉద్యమానికి బీఆర్ఎస్ సిద్ధంగా ఉన్నదని హరీశ్‌రావు తెలిపారు. శనివారం ఎక్స్ వేదికగా బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని గులాబీ శ్రేణులకు శుభాకాంక్షలు తెలియజేశారు. 'ఒక్కడితో మొదలైన బీఆర్ఎస్ ప్రస్థానం, ఉద్యమమై ఉప్పెనగా మారి స్వరాష్ట్ర కలను సాకారం చేసింది. తెలంగాణ జెండా ఎత్తిసనాడు కేసీఆర్ వెంట పిడికెడు మంది లేరు. కానీ, ఎత్తిన పిడికిల్లకు మూడున్నర కోట్ల పిడికిల్లను కేసీఆర్ జత చేసిండు. ఎన్నో ఎత్తు పల్లాలు, ఎన్నో ఒడిదుడుకులు, ఎన్నో అణచివేతలు, ఎన్నో అవమానాలు. 23 ఏండ్ల సుదీర్ఘ ప్రయాణంలో కేసీఆర్ ఎన్నడూ ఎత్తిన జెండాను దించలేదు. పట్టిన పట్టును విడవలేదు. త్యాగాల పునాదుల మీద పుట్టిన పార్టీ ప్రత్యేక రాష్ట్ర సాధన గమ్యాన్ని ముద్దాడి, పదేండ్ల పాలనలో ప్రజలకు అద్భుతమైన ప్రగతి ఫలాలు అందించింది. ఈ ఘనత ముమ్మాటికీ గులాబీ జెండాదే. ఆత్మగౌరవంతో బతికే జాతి తెలంగాణ జాతి. ఆత్మగౌరవం దెబ్బ తిన్నప్పుడల్లా ధిక్కారస్వరమై నిలిచింది. కాంగ్రెస్ పాలనలో రైతులు, అన్ని వర్గాల ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం, ఇచ్చిన హామీలను అమలు చేయటం లేదు. తెలంగాణకు నష్టం జరిగిన ప్రతిసారి బీఆర్ఎస్ గొంతెత్తి నినదించింది. ప్రజల పక్షాన పోరాటం చేసింది. ఇప్పుడు మరోసారి ప్రజల పక్షాన ప్రజా ఉద్యమం చేసేందుకు బీఆర్ఎస్ పార్టీ సంసిద్ధమైంది' అని పేర్కొన్నారు. కార్యక్రమాల్లో కరీంనగర్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వినోద్ కుమార్, ఎమ్మెల్యే గంగుల కమలాకర్, మేయర్ సునీల్‌రావు, మాజీ ఎమ్మెల్సీ భానుప్రసాద్‌రావు, స్థానిక కార్పొరేటర్ ఐలేందర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

హరీశ్ సవాల్‌ను స్వీకరించు

- రుణమాఫీ, ఆరు గ్యారెంటీలను ఆగస్టు 15లోగా అమలు చేయకుంటే రాజీనామా చేస్తానని ప్రకటించాలి
- ఓటమి భయంతోనే దేవుడిపై ఒట్లు
- రేవంత్‌రెడ్డిపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద

హైదరాబాద్, ఏప్రిల్ 27 (నమస్తే తెలంగాణ): రైతు రుణమాఫీ, ఆరు గ్యారెంటీలను ఆగస్టు 15లోగా అమలు చేయకుంటే ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేస్తానని రేవంత్‌రెడ్డి ప్రకటించాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద డిమాండ్ చేశారు. రేవంత్ రాజకీయ ప్రస్థానమే అబద్ధాల పునాదుల మీద మొదలైందని ఎద్దేవా చేశారు. మాజీ మంత్రి హరీశ్‌రావు సవాల్‌ను రేవంత్‌రెడ్డి స్వీకరించలేకపోతున్నారని, మాటల గారడీలతో ప్రజలను మభ్య పెడుతున్నారని దుయ్యబట్టారు. శనివారం ఆయన తెలంగాణభవన్‌లో మీడియాతో మాట్లాడుతూ.. అబద్ధాల పునాదుల మీద ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన రేవంత్‌రెడ్డి ప్రజా విశ్వాసం కోల్పోయారని విమర్శించారు. ఎక్కువ ఎంపీ స్థానాలు గెలుచుకోలేక పోతే, సీఎం పదవికి ఎసరు వస్తుందన్న భయంతోనే దేవుళ్ల మీద ఒట్లు పెడుతున్నారని మండిపడ్డారు. హరీశ్‌రావు అంటే ప్రజల్లో నమ్మకం ఉన్నదని, ఆయన రాజీనామా సవాల్‌ను ప్రజలు నమ్ముతున్నారని చెప్పారు. రేవంత్‌కు చిత్తశుద్ధి ఉంటే తన రాజీనామా పత్రాన్ని తనకు ఇష్టమైన వ్యక్తి దగ్గర పెట్టాలని సవాల్ చేశారు. కొడంగల్‌లో ఎమ్మెల్యేగా ఓడిపోతే, జీహెచ్ఎంసీ ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలిస్తే రాజకీయ సన్యాసం తీసుకుంటానని చెప్పిన రేవంత్ రెండుసార్లూ మాట తప్పారన్నారు. టీడీపీ నుంచి కాంగ్రెస్‌లోకి వెళ్లేటప్పుడు రేవంత్ రాజీనామా లేఖను స్పీకర్‌కు కాకుండా చంద్రబాబుకు పంపారని గుర్తుచేశారు. హరీశ్‌రావు రాజీనామాపై మాట్లాడే ముందు రేవంత్ తన గతాన్ని గుర్తు చేసుకోవాలని హితవు పలికారు.

ఖమ్మం కాంగ్రెస్‌లో అసంతృప్త జ్వాలలు

- బరిలో నిలవాలని 'పోట్ల'పై అనుచరుల ఒత్తిడి
- ఎన్నికల ప్రచారానికి కీలక నేతల హాజరుపై ఫోకస్
- రంగంలోకి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, రఘురాంరెడ్డి

ఖమ్మం, ఏప్రిల్ 27 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): ఖమ్మం లోక్‌సభ స్థానానికి కాంగ్రెస్ తరపున పోటీ చేసేందుకు ఆ పార్టీ నుంచి అనేకమంది నేతలు దరఖాస్తు చేసుకున్నారు. 25 రోజులపాటు వీరి మధ్య దోబూచులాడిన అభ్యర్థిత్వం ఎట్టకేలకు ఖరారైంది. రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వియ్యంకుడు రఘురాంరెడ్డిని ఖమ్మం లోక్‌సభ అభ్యర్థిగా ఆ పార్టీ ప్రకటించింది. దీంతో టికెట్ ఆశించి భంగపడిన నేతల్లో నెలకొన్న అసంతృప్తి ఒక్కసారిగా భగ్గుమన్నది. కాంగ్రెస్ అభ్యర్థిత్వాన్ని ఆశించిన మాజీ ఎమ్మెల్సీ పోట్ల నాగేశ్వరరావు అనుచరులు శుక్రవారం కొత్తగూడెం జిల్లా కేంద్రంలో సమావేశమై పోట్లకు టికెట్ ఇవ్వకపోవడంపై తీవ్ర అసంతృప్తి వెలిబుచ్చారు. జిల్లాలో బలమైన సామాజికవర్గానికి చెందిన పోట్ల నాగేశ్వరరావు కాంగ్రెస్ రెబల్ అభ్యర్థిగా ఎన్నికల బరిలో నిలవాలని ఆయన అనుచరుల నుంచి తీవ్రస్థాయిలో ఒత్తిడి వస్తున్నట్టు సమాచారం. 17 లోక్‌సభ స్థానాల్లో ఒక్క స్థానాన్ని కూడా కమ్మ సామాజికవర్గానికి కేటాయించలేదని చర్చించుకున్నారు. ఖమ్మం కాంగ్రెస్ అభ్యర్థిగా రఘురాంరెడ్డిని పార్టీ ఖరారు చేసిన తర్వాత ఈ నెల 25న ఆయన నామినేషన్ దాఖలు చేశారు. కాంగ్రెస్ అభ్యర్థిత్వానికి దరఖాస్తు చేసిన పొంగులేటి ప్రసాదరెడ్డి మినహా ఏ ఒక్కరూ హాజరు కాలేదు. ఉప ముఖ్యమంత్రి మల్లు కూడా గైర్హాజరవడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది. సీనియర్ నేతలు పార్టీ ఇచ్చే ప్రాధాన్యాన్ని బట్టి ఎన్నికల ప్రచారంలో పాల్గొనాలా? వద్దా? అని భావిస్తున్నట్టు సమాచారం.

అసంతృప్తులకు నేతల బుజ్జగింపులు

ఎన్నికలు సమీపిస్తుండటంతో కాంగ్రెస్‌లోని అసంతృప్తులను బుజ్జగించేందుకు పార్టీ ఖమ్మం లోక్‌సభ నియోజకవర్గ ఇన్‌చార్జి, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, అభ్యర్థి రఘురాంరెడ్డి రంగంలోకి దిగారు. నామినేషన్ల ఉపసంహరణకు సోమవారం చివరిరోజు కావడంతో.. రెబల్ నామినేషన్లను ఉపసంహరింపజేసేందుకు కాంగ్రెస్ నేతలు పోట్ల నాగేశ్వరరావు, యాదయ్యలతో మంతనాలు జరుపుతున్నారు.

ఇప్పుడే ఎలచ్చన్ పెడితే కేసీఆరే అస్తడు

- రేవంత్‌రెడ్డి అబీ ఇబీ ఇస్తనన్నడు
- ఏదీ ఇస్తలేదు.. అన్నీ పాయినయ్
- కాంగ్రెస్ సర్కార్ తీరుపై మెదక్ బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డితో ఐలవ్వ

గజ్వేల్, ఏప్రిల్ 27 : 'మళ్లేసుడు కాదు.. ఇప్పుడే ఎలచ్చన్ పెట్టుర్రి. ఇప్పుడే తెలంగాణ పార్టీ గెలుస్తది. మిషన్‌లతో తెలువక మోసపోయినమ్. కేసీఆర్ దేవుడు' అంటూ గజ్వేల్ సమీకృత మార్కెట్‌లో జగదేవ్‌పూర్ మండలం తిగుల్ గ్రామానికి చెందిన ఐలవ్వ అనే కూరగాయల వ్యాపారి మెదక్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డితో అన్నమాటలివి. శనివారం ఆయన సమీకృత కూరగాయల మార్కెట్‌లో ఎన్నికల ప్రచారంలో భాగంగా సదరు మహిళను కారు గుర్తుకు ఓటు వేయాలి కోరారు. వెంటనే ఐలవ్వ స్పందించి కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న మోసాన్ని వివరించింది. 'మూడు నెలల్లో పాలాలు అన్ని ఎండిపోయినయ్.. కరెంట్ పోయింది.. ఫ్రీ బస్సుతో జనం సచ్చిపోతుర్రు. కిందొకరు సస్తుర్రు.. మీదొకరు సస్తుర్రు.. రేవంత్‌రెడ్డి పింఛన్లు నాలుగు వేలు ఇస్తనన్నాడు.. అదీ పోయింది. ముసలోల్లకు ఇవి అవ్వి అన్నడు.. అన్నీ పోయినయ్. ఉరేసుకొనికి పోతుర్రు. బ్యాంకుల మాఫీ అయితయన్నడు. అవీ కాలే అని ఆ మహిళ ఆవేదన వ్యక్తం చేసింది. కల్యాణలక్ష్మి ఇస్తుర్రా అని ఐలవ్వను వెంకట్రామిరెడ్డి అడగ్గా.. ఎప్పుడో దెంకపోయింది. తులం బంగారం అన్నడు అదీ పోయింది. కారుకు మళ్లేసుడు. కాదు, ఇప్పుడే ఎలచ్చన్లు పెట్టుర్రి, ఇప్పుడే తెలంగాణ వస్తది. ఇప్పుడే కేసీఆర్ వస్తడు. మీరు అనవసరంగా ఐదేండ్ల టైం పెట్టిర్రు. మిషన్లు పెట్టడంతో తెల్వక మోసపోయాం' అని ఆమె పేర్కొన్నది. కచ్చితంగా అందరు కారు గుర్తుకే ఓటు వేయాలని వెంకట్రామిరెడ్డి కోరుతూ కరపత్రాన్ని అందిస్తుండగా.. 'ఇదెందుకు సారూ.. మా ఇంట్ల కేసీఆర్ ఫొటోనే ఉన్నది' అని చెప్పింది.

15, 16న 'పీఆర్సీ' చర్చలు

హైదరాబాద్, ఏప్రిల్ 27 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని ఉద్యోగులు, పెన్షనర్ల వేతన సవరణకు నియమించిన పీఆర్సీ కమిటీ ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలతో చర్చలు జరపనున్నది. ఈ మేరకు వివిధ సంఘాలకు పీఆర్సీ కమిటీ ఆహ్వానాలను పంపింది. మే 15న బీఆర్కే భవన్‌లో నిర్వహించే సమావేశానికి హాజరుకావాలని బహుజన క్లాస్ టీచర్స్ అసోసియేషన్ (బీసీటీఏ), 16న సమావేశానికి హాజరుకావాలని తెలంగాణ టీచర్స్ యూనియన్ (టీటీయూ) తదితర సంఘాలకు ఆహ్వానాలు పంపించింది. ఇటీవలే పీఆర్సీ కమిటీ సంఘాల నుంచి ప్రతిపాదనలు స్వీకరించింది. ఫిట్‌మెంట్ సహా పలు అంశాలపై ప్రతిపాదనలను సంఘాలు కమిటీ ముందుంచాయి.

ఆగస్టు 15లోపు రుణమాఫీ సాధ్యమా?

- కార్పొరేషన్ ఏర్పాటు ద్వారా అంత ఈజీ కాదంటున్న ఆర్థిక, బ్యాంకింగ్ నిపుణులు
- రుణ బదిలీకి బ్యాంకులు ఒప్పుకోవాలి
- రిజర్వ్‌బ్యాంక్ అనుమతి తప్పనిసరి
- మార్గదర్శకాలు, కటాఫ్ తేదీ నిర్ణయించని సర్కార్
- రైతుల వివరాలసేకరణకే 4 నెలలు
- మాఫీ చేయాల్సిన రుణం సుమారు 40 వేల కోట్లు
- ఎంపీ ఎన్నికల వేళ మభ్యపెట్టేందుకేనని విమర్శలు

కేసీఆర్ చేసిన రుణమాఫీ పొందినవారు వెంటనే బ్యాంకుకు వెళ్లి రూ.2 లక్షలు తెచ్చుకోండి. నేను రాగానే డిసెంబర్ 9న మొత్తం రుణాలను మాఫీ చేస్తా. అందుకే రుణాలు తెచ్చుకోవాలని రైతులను కోరుతున్నా.
-అసెంబ్లీ ఎన్నికలకు ముందు రుణమాఫీపై రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు

రుణమాఫీ సాధ్యమవుతుంది. ఇందుకు రూ.30-32 వేల కోట్లు అవసరం. 50 నెలలకు ఇన్‌స్టాల్‌మెంట్‌గా తీసుకుంటాం. ఒక నెలలో రుణమాఫీ పూర్తిచేస్తాం.
- జనవరి 6న ఒక న్యూస్ చానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో సీఎం రేవంత్‌రెడ్డి

నారాయణపేట గడ్డపై నుంచి 69 లక్షల మంది తెలంగాణ రైతులకు మాట ఇస్తున్నా. ఆగస్టు 15లోపు రూ.2 లక్షల రుణమాఫీ చేసి తీరుతా.
- ఏప్రిల్ 15న ఎన్నికల సభలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటన

హైదరాబాద్, ఏప్రిల్ 27 (నమస్తే తెలంగాణ): అధికారంలోకి రాగానే రూ.2 లక్షల రైతు రుణమాఫీ చేస్తామంటూ నమ్మబలికిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, అధికారంలోకి వచ్చిన తరువాత ఎప్పటికప్పుడు దాటవేస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఇప్పటికే మూడుసార్లు మాట తప్పిన రేవంత్ రెడ్డి మరోసారి మాట తప్పరనే గ్యారెంటీ ఏమున్నదని ప్రశ్నిస్తున్నారు. పార్లమెంట్ ఎన్నికలు దగ్గరపడుతున్నందున ఆగస్టు 15లోపు రుణమాఫీ చేస్తామంటూ ప్రకటించారని, దీనిని నమ్మలేమని రైతులు చెప్పున్నారు. రైతు బంధు అంశంలోనూ ఇదేవిధంగా చేశారని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

ఆగస్టు 15లోపు రుణమాఫీ కష్టమే

సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించిన విధంగా ఆగస్టు 15లోపు రూ.2 లక్షల రుణమాఫీ పూర్తి చేయడం కష్టమేనని ఆర్థిక, బ్యాంకింగ్ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. రుణమాఫీ సీఎం చెప్పినంత ఈజీ కాదని చెబుతున్నారు. జూన్ వరకు ఎన్నికల కోడ్ అమల్లో ఉంటున్నందున అప్పటివరకు ఎలాంటి నిర్ణయాలు తీసుకోలేరు. మిగిలిన రెండు నెలల్లోనే మార్గదర్శకాలు రూపొందించడం, కార్పొరేషన్ ఏర్పాటు చేయడం, బ్యాంకుల నుంచి లెక్కలు తెప్పించడం, బ్యాంకుల రుణాలను కార్పొరేషన్‌కు బదిలీ చేయించడం సాధ్యం కాదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటివరకు ప్రభుత్వం రుణమాఫీపై మార్గదర్శకాలను రూపొందించలేదు. కటాఫ్ తేదీని నిర్ణయించలేదు. మార్గదర్శకాలు రూపొందించలేదు. బ్యాంకర్లు రైతు రుణాల వివరాలను ప్రభుత్వానికి ఇచ్చేందుకు 4 నెలల సమయం పడుతుందని వ్యవసాయశాఖ వర్గాలు తెలిపాయి. ఇలాంటి పరిస్థితుల్లో సీఎం చెప్పినట్టుగా ఆగస్టు 15లోపు రుణమాఫీ ఏవిధంగా సాధ్యమవుతుందనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి.



కార్పొరేషన్ ఏర్పాటు.. అనేక సమస్యలు

రుణమాఫీ ఏ విధంగా చేస్తారనే దానిపై ఒక సందర్భంలో సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. రుణమాఫీ కోసం ప్రత్యేకంగా ఒక కార్పొరేషన్‌ను ఏర్పాటుచేస్తామని తెలిపారు. బ్యాంకుల్లో ఉన్న రైతుల మొత్తం రుణాలను ఆ కార్పొరేషన్‌కు బదిలీ చేయించుకొని, ఆ మొత్తాన్ని నెల వారీ వాయిదాల మాదిరిగా బ్యాంకులకు చెల్లిస్తామని చెప్పారు. కార్పొరేషన్ ఏర్పాటు, దాని ద్వారా రుణమాఫీ అంత సులువుకాదని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

కటాఫ్ తేదీ ఎప్పుడు?

మార్గదర్శకాలు రూపొందించి, కటాఫ్ తేదీని నిర్ణయించిన తరువాతనే రైతుల రుణాలు మొత్తం ఎంత ఉన్నాయనే లెక్క తేలుతుంది. గతంలో కేసీఆర్ సర్కారు తొలిసారి రుణమాఫీ చేసినప్పుడు 2014 మార్చి 30 వరకు ఉన్న రూ.లక్షలోపు రుణాలను మాఫీ చేస్తామని ప్రకటించింది. ఆ ప్రకారం 35.31 లక్షల మంది రైతులకు సంబంధించిన రూ.16,144 కోట్ల రుణాలను మాఫీ చేసింది. రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత కేసీఆర్ ప్రభుత్వం 2014 ఏప్రిల్ 1 నుంచి 2018 డిసెంబర్ 11 వరకు ఉన్న రూ.లక్ష లోపు రుణాలను మాఫీ చేస్తామని ప్రకటించింది. అసెంబ్లీ ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చేనాటికి 23 లక్షల మందికి సంబంధించిన రూ.13 వేల కోట్లను మాఫీ చేసింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటివరకు రుణమాఫీపై కటాఫ్ తేదీని నిర్ణయించకపోవడంతో అసలు మాఫీ చేయాల్సిన రుణం ఎంత? ఏ రైతులకు మాఫీ అవుతుంది? ఎవరికి కాదు? అనే అంశంపై స్పష్టత కొరవడింది.

మాఫీ చేయాల్సిన రుణం 40వేల కోట్లు!

మాఫీ చేయాల్సిన రైతుల రుణం రూ. 32 వేల కోట్ల వరకు ఉంటుందని ఒక సందర్భంలో రేవంత్‌రెడ్డి పేర్కొనగా, ఈ మొత్తం రూ.40 వేల కోట్ల వరకు ఉంటుందని వ్యవసాయశాఖవర్గాలు అంచనా వేస్తున్నాయి. కటాఫ్ తేదీ నిర్ణయించి, బ్యాంకుల నుంచి సమాచారం సేకరించిన తర్వాత కటాఫ్ తేదీ నిర్ణయిస్తే ఏ రైతుకు రుణమాఫీ వర్తిస్తుంది? అనే అంశంపై స్పష్టత వస్తుందని తెలిపాయి.

బడ్జెట్‌తో సంబంధం లేకుండా నిధులు

సాధారణంగా వివిధ పథకాలకు ప్రభుత్వాలు బడ్జెట్‌లో నిధులు కేటాయించి, ఆ ప్రకారం అమలు చేస్తాయి. రుణమాఫీ విషయంలో ఇందుకు భిన్నంగా జరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. కార్పొరేషన్ ఏర్పాటు ద్వారా రుణమాఫీ చేయాలని భావిస్తే, బడ్జెట్‌తో సంబంధం లేకుండానే నిధులు కేటాయించాల్సిన అవసరం ఉంటుందని నిపుణులు చెప్తున్నారు. బ్యాంకుల రుణాలను కార్పొరేషన్‌కు బదలాయిస్తే ప్రతి నెలా కచ్చితంగా బ్యాంకులకు చెల్లించాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో బడ్జెట్‌తో సంబంధం లేకుండా నిధులు సమకూరే ఇతర మార్గాల ద్వారా కేటాయించాల్సిన అవసరం ఉంటుంది. అలా అయితేనే బ్యాంకులు ఈ ప్రతిపాదనకు ఒప్పుకుంటాయని భావిస్తున్నారు.

కార్పొరేషన్ ఏర్పాటు సాధ్యాసాధ్యాలు

- కార్పొరేషన్‌కు రుణాలను బదిలీ చేసేందుకు బ్యాంకులు అంగీకరించాలి.
- సదరు కార్పొరేషన్‌కు రెగ్యులర్‌గా వచ్చే ఆదాయ మార్గాలను బ్యాంకులకు చూపించాల్సి ఉంటుంది.
- రుణమాఫీ కోసం బడ్జెట్‌లో కేటాయించే నిధులు కాకుండా, ప్రత్యేకంగా వచ్చే ఆదాయాన్ని చూపించాల్సి ఉంటుంది.
- దీంతోపాటు బ్యాంకులకు ప్రభుత్వం నమ్మకం కల్పించాలి. బాండ్స్ రూపంలో గానీ, ఇతర మార్గాల్లో గానీ బ్యాంకులకు ప్రభుత్వం ష్యూరిటీ ఇవ్వాల్సి ఉంటుం